సాక్షి అనకాపల్లి

శనివారం । 3 । జూన్ । 2023



పింఛన్ల పంపిణీ

8లో

ముఖ్యమంత్రి ఆశయాలను నెరవేరుస్తూ పలువురు వలంటీర్లు ఆస్పత్రులకు వెళ్లి మరీ పింఛన్లు అందజేశారు.



మానసిక దృఢత్వం ముఖ్యం

అనకాపల్లి ఎస్పీ కె.వి.మురళీకృష్ణ శుక్రవారం విశాఖలోని ఏఆర్ పోలీస్ కార్యాలయాన్ని సందర్శించి, పోలీస్ పరేడ్‌ను పరిశీలించారు.

అనకాపల్లి ఉష్ణోగ్రత
గరిష్ట /కనిష్ట
40.8/25.0

రాగల ఐదు రోజులు ఆకాశం మేఘావృతమై ఉంటుందని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త ఎంజీజీఎస్ కుమారి శుక్రవారం తెలిపారు. ఉష్ణోగ్రతలు 35.5 నుంచి 39.2 డిగ్రీలు, గాలిలో తేమ 72 నుంచి 80 శాతం నమోదు కావచ్చన్నారు.

న్యూస్‌రీల్

దిశ యాప్ ద్వారా యువకుడి ఆటకట్టు

కోటవురట్ల: దిశ యాప్ ఓ బాలికకు రక్షణ కల్పించింది. యువకుడి వేధింపులకు ముగింపు పలికింది. తంగేడు గ్రామానికి చెందిన బాలికను అదే గ్రామానికి చెందిన ఎం.ప్రసాద్ అనే యువకుడు మొబైల్ వాట్సాప్ మెసేజీల ద్వారా వేధిస్తున్నాడు. విషయం బాలిక తల్లిదండ్రులకు తెలియడంతో దిశ ఎస్‌వోఎస్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేశారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు వేధింపులకు పాల్పడిన యువకుడిని ప్రసాద్‌గా గుర్తించారు. ఇరు పక్షాల పెద్దల సమక్షంలో పోలీసులు యువకుడికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మరోసారి వేధిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించి బైండోవర్ చేశారు. దీనిపై కేసు నమోదు కాలేదని ఎస్‌ఐ నారాయణరావు తెలిపారు.

చినజీయర్‌స్వామికి ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న వేదపండితులు, భక్తులు

అనకాపల్లి టౌన్: గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన రాజుపాలెం శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయానికి శుక్రవారం రాత్రి త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్‌స్వామి చేరుకున్నారు. వేదపండితులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు స్వామీజీకి ఘన స్వాగతం పలికారు. వేదపండితుల మంత్రోచ్చారణలతో ఆలయం మారుమోగింది.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం

అనకాపల్లిటౌన్ : జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా మొదలయ్యాయి. తొలి రోజు 21 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన తెలుగు పరీక్షకు 350 మంది గైర్హాజరైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ మీడియాకు తెలిపారు. మొత్తం 1595 మంది హాజరుకావాల్సి ఉండగా, 1245 మంది హాజరైనట్టు పేర్కొన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 13 సెంటర్లను తనిఖీ చేసినట్టు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు ఆమె పేర్కొన్నారు.

టౌన్‌ప్లానింగ్ 'ఓపెన్ ఫోరం'కు 8 ఫిర్యాదులు

డాబాగార్డెన్స్ (విశాఖ): టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరంలో 8 ఫిర్యాదులు అందాయి. చీఫ్ సిటీ ప్లానర్ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో డీసీపీలు, ఏసీపీలు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, డబ్ల్యూఆర్‌ఎస్ సిబ్బంది పాల్గొన్న ఓపెన్ ఫోరంలో జోన్-3 నుంచి రెండు, జోన్-4 నుంచి ఒకటి, జోన్-5 నుంచి నాలుగు, జోన్-6 నుంచి ఒక ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా సురేష్‌కుమార్ మాట్లాడుతూ జీవీఎంసీ 8 జోన్లలో ఎలాంటి అనధికార నిర్మాణాలు, ఇతర ఫిర్యాదులకు జీవీఎంసీ టోల్‌ఫ్రీ నంబరు 1800 4250 0009కు ఫోన్ చేయాలన్నారు. అలాగే జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఏర్పాటు చేసిన ఫోన్ నెంబరు 8187897569కు ఫోన్ చేసి ఫిర్యాదులు తెలపాచ్చన్నారు. కార్యక్రమంలో డీసీపీలు నరేంద్రరెడ్డి, వసంతకుమార్, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

రైతన్నకు వరం..

వైఎస్సార్ యంత్ర సేవా పథకం

- రైతు గ్రూపులకు 40 శాతం సబ్సిడీపై ట్రాక్టర్లు పంపిణీ
- అనకాపల్లిలో లబ్ధిదారులకు అందజేసిన మంత్రి అమర్‌నాథ్



బారులు దీరిన ట్రాక్టర్లు



రైతులకు చెక్ అందజేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, అధికారులు

జిల్లాలో యంత్ర సేవా పథకం
మొదటి విడతగా 271 గ్రూపులకు 154 ట్రాక్టర్లు
రెండో విడతలో 148 గ్రూపులకు 72 ట్రాక్టర్లు

సాక్షి, అనకాపల్లి: సులభతర వ్యవసాయం కోసం యంత్ర పరికరాలను అందించే వైఎస్సార్ యంత్ర సేవాపథకం మరోసారి వరాలు కురిపించింది. రెండో విడతగా 148 గ్రూపులకు 72 ట్రాక్టర్లు పంపిణీ చేసే బృహత్తర కార్యక్రమాన్ని శుక్రవారం ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించారు. కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టితో కలిసి ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ రైతులకు ట్రాక్టర్లు, యంత్ర పరికరాలను అందజేశారు. అనంతరం రైతులకు చెక్ పంపిణీ చేశారు. గ్రూపులుగా ఏర్పడ్డ చిన్న, సన్నకారు రైతులకు ప్రభుత్వం 40 శాతం సబ్సిడీపై యంత్ర పరికరాలను సమకూరుస్తున్న విషయం తెలిసిందే. అద్దె ప్రాతిపదికన వ్యవసాయ యంత్ర సేవలను అందించడం ద్వారా వారికి పెట్టుబడి ఖర్చులు, నిర్వహణ వ్యయ భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వస్తోంది. అన్నదాతలకు ట్రాక్టర్లు, ఆధునిక యంత్ర పరికరాలను అందిస్తూ రైతు బాంధవుడిగా సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారు. వ్యవసాయం, వాటి అనుబంధ రంగాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చి ఆర్‌బీకేల పేరిట రైతు ముంగిటకే ప్రభుత్వ ఫలాలు అందుతున్నాయి. ఆర్బీకేలకు అనుబంధంగా రైతు మిత్ర గ్రూపులతో కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లు (సీహెచ్‌సీ) ఏర్పాటు చేశారు.

వ్యవసాయానికి పెద్దపీట

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ రైతు గ్రూపులకు యంత్రపరికరాలను పంపిణీ చేశారు. స్వయంగా ట్రాక్టర్ నడిపి వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యవసాయానికి ముఖ్యమంత్రి పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. యంత్ర పరికరాల ఖరీదులో 40 శాతం సబ్సిడీని ప్రభుత్వం భరిస్తోందని చెప్పారు. 50 శాతం మొత్తానికి బ్యాంకు రుణం ఇస్తుంది.. కేవలం 10 శాతం మాత్రమే గ్రూప్ సభ్యులు చెల్లిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. దళారుల ఆధిపత్యం లేకుండా.. అవినీతికి తావు లేకుండా నేరుగా లబ్ధిదారునికి చేరేలా.. తక్కువ ధరలకే ప్రభుత్వం యంత్ర పరికరాలను అందిస్తోందన్నారు. గత ఏడాది మొదటి విడతలో యంత్ర పరికరాల పంపిణీలో 271 గ్రూప్‌లకు రూ.4.61 కోట్ల విలువైన పరికరాలను అందజేసినట్టు తెలిపారు. రెండో విడతలో 148 సీహెచ్‌సీలకు రూ.2 కోట్ల 61 లక్షల 99 వేల విలువైన 72 ట్రాక్టర్లు, వివిధ యంత్ర పరికరాలను సరఫరా చేయడం జరిగిందన్నారు.



ట్రాక్టర్ నడుపుతున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

450 ఆర్‌బీకేల ద్వారా సేవలు: కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

జిల్లాలో 450 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సేవలు అందిస్తున్నామని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి పేర్కొన్నారు. రైతులకు సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు అందించడం జరుగుతుందన్నారు. సంక్షేమ పథకాల్లో సమస్యలను 1902 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి చెబితే.. వాటిని తక్షణమే పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

యంత్ర సేవా పథకం వ్యవసాయదారులకు ఎంతో ప్రయోజనకరమన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, వ్యవసాయ శాఖాధికారి మోహన్‌రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ప్రభాకర్‌రావు, ఎంపీపీ గొర్లె సూరిబాబు, బుల్లిబాబు పాల్గొన్నారు.

రైతులకు అండగా సీఎం జగనన్న



నాకు మూడు ఎకరాల భూమి ఉంది. వ్యవసాయం చేసుకుంటున్నాను. ఇప్పటి వరకు దుక్కు, దమ్ములు లాంటివి అద్దెకి చేయించుకునేవాడిని. పెట్టుబడి ఎక్కువైంది. అలా అని సొంతంగా ట్రాక్టర్ కొనుగోలు చేసుకుందామంటే అంత నగదు ఒక్కసారే పెట్టుకోవాలంటే కష్టతరంగా ఉంది. వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా సబ్సిడీలో ట్రాక్టర్ మంజూరయింది. ఇప్పుడు నాకు పెట్టుబడి తగ్గి ఆదాయం పెరుగుతుంది. సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నన్నాళ్లు రైతుకు కష్టాలుండవు.

– కె.కొండబాబు, కె.చింతనిప్పుల అగ్రహారం, అనకాపల్లి మండలం

ఆదాయం పెరుగుతుంది




వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నాం. మాకు ఐదు ఎకరాల పొలం ఉంది. ఇప్పటివరకూ అద్దెకు ట్రాక్టర్లతో వ్యవసాయం చేస్తున్నాం. ప్రైవేటు ట్రాక్టర్లు ఎకరా దమ్ముకు రూ.1200 నుంచి రూ.1800 వరకు అద్దె తీసుకుంటున్నారు. ఈ ఏడాది నుంచి మాకు పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయి. వ్యవసాయం చేసే మాలాంటి రైతు కుటుంబాల శ్రేయస్సు కోసం పాటుపడే సీఎం జగనన్నకు ధన్యవాదాలు.

– ఎస్.కృష్ణవేణి, కోడూరు, అనకాపల్లి

8న విశాఖకు అమిత్‌షా

- మోదీ తొమ్మిదేళ్ల పాలనపై భారీ సభ
- ఏర్పాట్లకు సన్నద్ధమవుతున్న బీజేపీ శ్రేణులు
- విశాఖకు షా రాక ఇది రెండోసారి



సాక్షి, విశాఖపట్నం: కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా ఈనెల 8న విశాఖకు వస్తున్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ శ్రేణులు దేశంలోని వివిధ ప్రాంతాల్లో సభలు నిర్వహిస్తున్నారు. ఇందులోభాగంగా విశాఖలోనూ అలాంటి సభను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల మైదానం లేదా రైల్వే గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించాలని ఆ పార్టీ నాయకులు యోచిస్తున్నారు. అమిత్‌షా సభకు బూత్‌కు కనీసం పది మంది చొప్పున 1936 బూత్‌ల నుంచి 20 వేల మందికి పైగా జనాన్ని, కార్యకర్తలను సమీకరించాలని భావిస్తున్నారు. దీనిపై తుది నిర్ణయం తీసుకునేందుకు శనివారం బీజేపీ కోర్ కమిటీ నేతలు సమావేశమవుతున్నారు. కాగా అమిత్‌షా విశాఖకు రానుండడం ఇది రెండోసారి. గత సాధారణ ఎన్నికల్లో ఆయన ఎన్‌ఏడీ నుంచి కంచరపాలెం వరకు నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొన్నారు. అమిత్‌షా పాల్గొనే బహిరంగ సభ సమయం ఇంకా ఖరారు కాలేదని బీజేపీ విశాఖ పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర తెలిపారు.

గ్రూప్-1 పరీక్షకు పటిష్ట బందోబస్తు

దొండపర్తి(విశాఖ దక్షిణ): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో శనివారం జరగనున్న గ్రూప్-1 రాత పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు నగర పోలీస్ కమిషనర్ త్రివిక్రమ వర్మ తెలిపారు. నగరంలో ఆంధ్రాయూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ, ఎకనామిక్స్, కామర్స్ బిల్డింగ్‌లో నిర్వహిస్తున్న ఈ పరీక్ష సుమారు 1300 అభ్యర్థులు హాజరవుతున్నట్లు వెల్లడించారు. ఎటువంటి అవకతవకలకు అవకాశం లేకుండా ప్రశాంతంగా పరీక్షలు జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు పలు సూచనలు చేశారు.

జ్ఞాపకాలు పదిలం..

- బ్రెయిన్‌డెడ్ యువకుడి అవయవాలు దానం
- ఆదర్శంగా నిలిచిన తల్లిదండ్రులు





మణికంఠ అంతిమ యాత్రలో పాల్గొన్న ప్రజలు (ఇన్‌సెట్) మళ్ల వెంకట మణికంఠ (ఫైల్)



వెంకట మణికంఠకు నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి

యలమంచిలి : అందివచ్చిన కొడుకు అర్ధంతరంగా మరణిస్తే ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోతారు. ఆ కష్టాన్ని ఎవరూ తీర్చలేరు. అయినప్పటికీ పుట్టెడు దుఃఖంలో కూడా తమ కుమారుడి జ్ఞాపకాలు పదిలం చేసుకోవడానికి.. అతని కదలికలను సజీవంగా ఉంచేందుకు ఆ తల్లిదండ్రులు ఉదాత్తమైన నిర్ణయం తీసుకుని అందరికీ ఆదర్శంగా నిలిచారు. యలమంచిలి మున్సిపాలిటీ పరిధి కొత్తపాలెం గ్రామానికి చెందిన మళ్ల వెంకట మణికంఠ (20) రెండు రోజుల క్రితం సీలేరు ధారాలమ్మ గుడికి బంధువులతో వెళ్లి తిరిగి వస్తుండగా తాళ్లపాలెం సమీపంలో తాను ప్రయాణిస్తున్న టాటా ఏస్ వాహనం నుండి జారి పడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మళ్ల వెంకట మణికంఠను కుటుంబ సభ్యులు విశాఖపట్నం కింగ్స్ ఐడియల్ ఆస్పత్రి (డెయిరీ ఆస్పత్రి)లో చేర్పించారు. ప్రమాదంలో తలకు బలమైన గాయాలు తగలడంతో వైద్యులు ఎంత ప్రయత్నించినా అతన్ని కాపాడలేకపోయారు. ఈ దశలో ధైర్యం కూడదీసుకున్న అతని తల్లిదండ్రులు మళ్ల కృష్ణ, పోలేరమ్మ కుమారుడి అవయవాలను అవసరమైన వారికి దానం చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో డాక్టర్లు జీవనధారకు అతని అవయవాలు డొనేట్ చేశారు. మృతుడు వెంకట మణికంఠకు ఒక సోదరి ఉంది. అతను యలమంచిలి పూర్ణసాయి వివేకానంద కళాశాలలో బీఎస్సీ కెమిస్ట్రీ మూడో సంవత్సరం చదువుతున్నాడు. మణికంఠ తల్లి వికలాంగురాలు. తండ్రి వ్యవసాయ కూలీ. చేతికి అందివచ్చిన ఒక్కగానొక్క కొడుకు రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోవడంతో ఆ కుటుంబం పుట్టెడు దుఃఖంలో మునిగిపోయింది. మణికంఠ మరణవార్త విన్న స్నేహితులు, బంధువులు, గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు. మణికంఠ అంతిమ యాత్రను దిమిలి రోడ్డు జంక్షన్ నుంచి బైక్ ర్యాలీతో కొత్తపాలెం గ్రామానికి ఊరేగింపుగా తీసుకెళ్లి సంతాపం వ్యక్తం చేశారు.

ప్రముఖుల పరామర్శ

అవయవదానం చేసిన మళ్ల వెంకట మణికంఠకు యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, మున్సిపల్ కమిషనర్ తోట కృష్ణవేణి, యలమంచిలి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ గఫూర్, పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు, కౌన్సిలర్లు రాపేటి సంతోష్, మరిణేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు తదితరులు నివాళులు అర్పించారు. అతని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

గిరి ప్రదక్షిణ ఏర్పాట్లపై సమీక్ష



సమీక్ష నిర్వహిస్తున్న ఈవో త్రినాథరావు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో జూలై 2వ తేదీన జరిగే గిరి ప్రదక్షిణ, 3న జరిగే ఆలయ ప్రదక్షిణ ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు సింహాచలం దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. గిరి ప్రదక్షిణ, ఆలయ ప్రదక్షిణలకు సంబంధించి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యులు, సెక్షన్ విభాగాల అధికారులతో ఈవో ముందస్తు సమీక్ష శుక్రవారం సింహగిరిపై నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల సమన్వయంతో గిరిప్రదక్షిణ ఉత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. వివిధ అంశాలపై అధికారులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులతో చర్చించారు. ముఖ్యంగా ఆరోజు 32కిలోమీటర్ల మేర భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేయనున్న స్టాల్స్, పుష్పరథం, ఆలయానికి పుష్పాలంకరణ, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, ఉచిత ప్రసాద వితరణ, అన్నప్రసాద భవనంలో భక్తులకు భోజనం, సింహగిరిపై క్యూలైన్లు ఏర్పాటు, తొలిపావంచా వద్ద ఏర్పాట్లు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ప్రధాన పురోహితులు శ్రీనివాసాచార్యులు, స్థానాచార్యులు రాజగోపాల్, ట్రస్ట్‌బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, పిల్లా జగన్‌మోహన్ పాత్రుడు, శ్రీదేవి వర్మ, సాయి నిర్మల, ముందుడి రాజేశ్వరి, బయ్యవరపు రాధ, దశమంతుల రామలక్ష్మి, దొడ్డి రమణ, దేవస్థానం డిప్యూటీ ఈవో సుజాత, ఇంజనీరింగ్ అధికారులు శ్రీనివాసరాజు, రాంబాబు, నాగేశ్వరరావు, హరి, ఏఈవోలు ఆనంద్‌కుమార్, ఇజిరోతు శ్రీనివాసరావు, జంగం శ్రీనివాస్, నరసింహరాజు, సూపరింటెండెంట్ పాలూరి నరసింగరావు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులు, విపత్తులపై చర్చ

డాబాగార్డెన్స్: యూఎస్ కాన్సులేట్ ప్రతినిధులు శుక్రవారం జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మను జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కలిశారు. వాతావరణంలో మార్పులు, విపత్తులు, ఎన్‌ఆర్‌ఐల రిలేషన్ షిప్‌లపై చర్చించారు. వాతావరణ మార్పులు, విపత్తులు సంభవించినప్పుడు ఏ విధంగా ఎదుర్కోవాలి అనే అంశంపై పరస్పర సహకారమందించేందుకు అవసరమైన వనరులపై చర్చించారు. యూఎన్డీపీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా విశాఖలో చేపడతున్న కార్యక్రమాలను కమిషనర్ వారికి వివరించారు. కార్యక్రమంలో యూఎస్ కాన్సులేట్ ప్రతినిధులు స్టీఫెన్ విల్లెర్, అలెగ్జాండ్రా మేయర్, యూఎన్డీపీ కాన్సులేట్ శ్రీనివాస్ రాజామని పాల్గొన్నారు.

నిప్పుల కొలిమి



పెరిగిన ఉష్ణోగ్రతలతో జనసంచారం లేక నిర్మానుష్యంగా మారిన చోడవరం మెయిన్‌రోడ్డు

- భారీగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- చోడవరంలో 43 డిగ్రీలు, అనకాపల్లిలో 40.8 డిగ్రీలు నమోదు
- ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత

అనకాపల్లి రూరల్/చోడవరం: రోజురోజుకూ పెరుగుతున్న ఎండలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. జిల్లా అంతటా శుక్రవారం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఒక్కసారిగా 4.5 డిగ్రీలు పెరగడంతో జనం వడగాడ్పులతో అల్లాడిపోయారు. చోడవరంలో 43 డిగ్రీలు, అనకాపల్లిలో 40.8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అనకాపల్లి పట్టణంలోని ప్రధాన రహదారులతో పాటు అంతర్గత రహదారులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి. మరికొన్ని రోజులు ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

రోళ్లు పగులుతున్నాయ్!

రోహిణీ కార్తెలో రోళ్లు సైతం పగులుతాయన్న నానుడి నిజం చేస్తూ ఎండలు తీవ్రరూపం దాల్చుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచే భానుడు ప్రతాపం చూపుతున్నాడు. అత్యవసర పనులకు సైతం బయట తిరగాలంటే ప్రజలు భయపడుతున్నారు. జిల్లా కేంద్రం అనకాపల్లి పట్టణంలో గడచిన మూడేళ్లతో పోల్చుకుంటే ఈసారి అధిక ఉష్ణోగ్రతలు ఉన్నట్టు నివేదికలు చెప్తున్నాయి. 2020, 2021, 2022 సంవత్సరాల్లో ఇదే సమయంలో 40 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అధిక ఉష్ణోగ్రతల దృష్ట్యా జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. పట్టణంలో పలుచోట్ల చలివేంద్రాలను ప్రజలకు అందుబాటులో ఉంచి మజ్జిగ, తాగునీరు వంటివి సరఫరా చేస్తున్నారు.

వ్యాపారాలు పాక్షిక బంద్

అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత కారణంగా ప్రజలు అల్లాడిపోతున్నారు. ఫ్యాన్లు తిరుగుతున్నా వేడి గాలి రావడంతో ఇళ్లల్లో కూడా ఉండలేని పరిస్థితి. రోడ్లు, ఫుట్‌పాత్‌లు, నెత్తిపై తట్ట పెట్టుకుని ఇంటింటికీ తిరిగే వ్యాపారులపై ఎండల ప్రభావం అధికంగా పడింది. ఉదయం 9 గంటలకే ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండటంతో వ్యాపారం చెసుకోలేని పరిస్థితి. కొందరు పొట్టకూటి కోసం మండుటెండలోనే వ్యాపారం చేసుకుంటుండగా, ఎక్కువశాతం మంది ఉదయం 11 తర్వాత రోడ్లపై కనిపించడంలేదు. తమ వ్యాపారాలకు పాక్షిక బంద్ ప్రకటిస్తున్నారు. సాయంత్రం 5 గంటల తర్వాతే మళ్లీ వ్యాపారం మొదలెడుతున్నారు. ఉపాధిహామీ పనులకు వెళ్లే ప్రజలు, వ్యవసాయ కూలీలు, మైనింగ్ కార్మికులు ఉదయం 11 గంటల నుంచి ఇంటి బాట పట్టేలా, మైనింగ్ పరిశ్రమల్లో పగలు డ్యూటీలను సైతం యజమానులు రద్దు చేశారు.



నిత్యం రద్దీగా ఉండే అనకాపల్లి నెహ్రూచౌక్ కూడలి ఇలా..

ద్రవ పదార్థాలతో కాస్త ఉపశమనం



వేసవికాలం ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవడం మంచిది. వడదెబ్బతో సొమ్మసిల్లి పడిపోతే వారికి ఎట్టి పరిస్థితుల్లో నీటిని ఇవ్వరాదు. వృద్ధులు, చిన్న పిల్లలు, గుండె వ్యాధి బాధితులు, సుగర్, కిడ్నీ బాధితులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు మరింత జాగ్రత్తగా ఉండాలి.

– ఎస్.వాణీజగదీశ్వరి, వైద్యురాలు, తుమ్మపాల పీహెచ్‌సీ

పాముల కలకలం

- పూడిమడక ఉప్పుటేరులో వందలాది సర్పాలు ప్రత్యక్షం
- సముద్రంలోంచి వచ్చినవా..? కంపెనీల వ్యర్థాల నుంచి వచ్చినవా..?
- ఒడ్డున పడేస్తే రసాయనం కక్కుతూ మృతి
- పాలుపోని స్థితిలో మత్స్యకారులు



ఉప్పుటేరులో పాములు (ఇన్‌సెట్) నేలపై పడిన పాములు, రసాయనం కక్కి మృత్యువాత పడుతున్న దృశ్యం

అచ్యుతాపురం (అనకాపల్లి): ఏపీలో అతి పెద్ద తీర ప్రాంతాల్లో ఒక్కటైన పూడిమడకలో పాముల కలకలం రేగింది. సముద్ర మొగ నుంచి నీరు వెళ్లే ఉప్పుటేరులో వందలాది పాములు శుక్రవారం ప్రత్యక్షమయ్యాయి. దీంతో పూడిమడకలో ఒక్కసారిగా ఆందోళన రేగింది. మత్స్యకారుల్లో ఆగ్రహావేశాలు మిన్నంటాయి. అసలు ఉప్పుటేరులో పాములేంటి? అవి ఎక్కడి నుంచి వచ్చాయనే ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి.

అంతుబట్టని పాముల పరిస్థితి..

ఉప్పుటేరులో ప్రత్యక్షమయ్యిన పాముల గురించి ఆ నోటా ఈ నోటా సమాచారం అందడంతో మత్స్యకారులంతా ఉప్పుటేరుకి వెళ్లారు. పాముల్ని చూసిన వారు కాస్త ఇబ్బందికి గురయ్యారు. సుమారు 200 కుటుంబాలకు చెందిన మత్స్యకారులు ఈ ఉప్పుటేరులో చేపల వేటపైనే ఆధారపడి జీవిస్తుంటారు. ఈ ఉప్పుటేరులోకి గతంలో కలుషిత నీరు రావడం వల్ల చేపలు మృతి చెందినప్పటికీ అధికారులు రకరకాల కారణాలు చెప్పి మత్స్యకారుల్ని శాంతింపజేశారు. అయితే తాజాగా కనిపిస్తున్న వందలాది పాములు సముద్రపు జెర్రిలని కొందరు చెబుతుండగా, పరిశ్రమలు వదిలిన వ్యర్థాల నుంచి ఉప్పుటేరులోకి చేరి ఉంటాయనే ప్రచారం మరొకటి ఉంది. నీటిలో చురుగ్గా కదులుతున్న ఈ పాముల్ని కర్రతో పట్టుకుని ఒడ్డుపై వేస్తే ఏవో రసాయనాలు కక్కి చనిపోవడంతో మత్స్యకారుల్లో భయం పట్టుకుంది.

ఉద్యమించేందుకు సన్నద్ధం..

ఉప్పుటేరులో జరుగుతున్న పరిణామాలపై మత్స్యకారులు ఉద్యమించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఒకవైపు మత్స్యసంపదను కోల్పోతున్న మత్స్యకారులకు తాజాగా పాముల సమస్య తలనొప్పిగా మారింది. సముద్రంలోంచి వందలాది పాములు రావాలంటే మొగ వద్ద నుంచి లోపలికి రావాలి. కానీ విశాలమైన సముద్రంలో ఇలాంటి పాములు ఎక్కడికైనా వెళ్లిపోతాయి. కానీ ఉప్పుటేరులోకి చేరాయంటే కంపెనీల వ్యర్థాలేనని మత్స్యకారులు పేర్కొంటున్నారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

క్లుప్తంగా

నాడు - నేడుతో పాఠశాలలకు మహర్దశ

- వీరవల్లిలో పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన డిప్యూటీ సీఎం బూడి



వీరవల్లిలో ఆర్బీకే భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి

మాడుగుల రూరల్: నాడు – నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టిందని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని వీరవల్లిలో శుక్రవారం ఆయన పలు అభివృద్ధి పనులు ప్రారంభించారు. రూ.21.60 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ.17.50 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ను, ఎంపీయూపీ పాఠశాలల్లో నాడు – నేడు నిధులు రూ.23 లక్షలతో ఆధునికీకరణ పనులను ప్రారంభించారు. ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైస్ ఎంపీపీలు రాజారామ్, శ్రీనివాస్, సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, ఈశ్వరరావు, ఉప సర్పంచ్ సయ్యపురెడ్డి గుణహరి, పంచాయతీ కార్యదర్శి కోరుకొండ జగదీశ్, హెచ్ఎం నాగేంద్ర పాల్గొన్నారు.

'నిశ్శబ్దమా నీ ఖరీదెంత'



నాటికను తిలకిస్తున్న ప్రేక్షకులు



నిర్జీవ నినాదం నాటిక ప్రదర్శన

- ప్రేక్షకులను ఆలోచింపజేసిన నాటికలు
- తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికలు ప్రారంభం

అనకాపల్లి టౌన్: నాటికల ద్వారా సమాజంలో లోటుపాట్లను గుర్తించి జాగృతం చేయొచ్చని హైదరాబాద్ వై.కె.నాగేశ్వరరావు నాటక కళా పరిషత్ చైర్మన్ బొప్పరాజు నర్సింహరావు అన్నారు. స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో వై.కె.నాగేశ్వరరావు(హైదరాబాద్), క్లబ్ సభ్యులు సంయుక్తంగా నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటికలను శుక్రవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణంలో సెల్ ఫోన్ యువతను పట్టి పీడిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు.

వివాహేతర సంబంధం నేరం కాదా?

వివాహేతర సంబంధం నేరం కాదని, చట్టప్రకారం ఎవరినీ శిక్షించేది లేదని ఉన్నత న్యాయస్థానం ఐపీసీ నుంచి 497 సెక్షన్ తొలగించింది. దీంతో కళ్ల ముందర భార్యాభర్తల్లో ఎవరైనా సరే మరొకరితో సంబంధం ఏర్పరచుకుంటే శిక్షించలేని నిస్సహాయత ఏర్పడింది.

కావలిస్తే ఈ కారణంగా విడాకులు ఇచ్చుకునే వెసులుబాటు కల్పించింది. మరి నైతిక విలువల మాటేమిటి, వివాహ వ్యవస్థ పవిత్రత మాటేమిటి? మరి ఈ అక్రమ సంబంధాల ఘర్షణలో నలిగిపోతున్న పిల్లల భవిష్యత్ ఏంటి? ప్రశ్నించుకుంటే జవాబు శూన్యం. చట్టమే ఆ స్వేచ్ఛనిస్తే ఇక వీటిని ఆపేదెవరు? ఈ సమాజం ఎటు పోతోంది? దీన్ని ఎవరూ ప్రశ్నించరే? అనే ప్రశ్న నుంచి ఉదయించినదే ఈ నాటిక 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత'. విశాఖపట్నం తెలుగు కళా సమితి వారు ప్రదర్శించిన ఈ నాటికకు కథ పి.టి.మాధవ్, దర్శకత్వం చలసాని కృష్ణప్రసాద్, నిర్వహణ వై.ఎస్.కె.ఎన్.స్వామి అందించారు.

'నిర్జీవ నినాదం'

నాణానికి మరో వైపు చూపించి, విప్లవకారులు త్యజించిన వారి కుటుంబాలు కూడా సమాజంలో ఉద్ధరించబడాల్సిన భాగాలు కాదా.? ఇంటిని ఉద్ధరించలేని వారు సమాజాన్ని ఉద్ధరించే ప్రయత్నం చేయడం... ఆ ప్రయత్నం కారణంగా కుటుంబ వ్యక్తిగత జీవితంలో ఏర్పడిన అశాంతి... అసంతృప్తి, మానసిక క్షోభ.. తాము నమ్ముకున్న వారు విప్లవం వర్ధల్లాలి అని నినదిస్తూ నిర్జీవంగా మారి కళ్ల ముందుకే వస్తే... ఆశలు చితికిపోయి, భవిష్యత్ చీకటిలోకి జారిపోయినప్పుడు ఆ కుటుంబ సభ్యుల దృష్టిలో.. అమరత్వం పొందిన విప్లవం వర్ధల్లాలి అన్న నినాదమే ఒక నిర్జీవ నినాదం. ఈ నాటికను శ్రీకాకుళం జిల్లా బొరివంక శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం ప్రదర్శించగా, రచన అడపా సూరిబాబు, దర్శకత్వం కె.కె.ఎల్.స్వామి, సంగీతం పి.లీలామోహన్ వహించారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేతలు



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల రూరల్: మండలంలోని వీరవల్లి అగ్రహారం గ్రామానికి చెందిన టీడీపీ వార్డు మాజీ సభ్యుడు విస్సారపు సత్తిబాబు, విస్సారావు నాగేశ్వరరావు, విస్సారావు రాజారావు, విస్సారపు స్వామి, విస్సారపు అప్పలనాయుడు తదితరులు వైఎస్సార్ సీపీలో చేరారు. శుక్రవారం వీరికి పార్టీ కండువాలు చేసి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సాదరంగా ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొత్తపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ వెలగాడ కామలక్ష్మి, ఈశ్వరరావు, ఉప సర్పంచ్ సయ్యపురెడ్డి గుణహరి, మాజీ సర్పంచ్ సయ్యపురెడ్డి నారాయణరావు, పార్టీ నాయకులు బోగాది శంకరరావు, దాడి రాజేశ్వరరావు, కోన శ్రీను, రామారావు, మల్లేటి భీమేష్, దొండా నాగమణి, పీఏసీఎస్ అధ్యక్షుడు కోరుకొండ చెల్లంనాయుడు పాల్గొన్నారు.

ఆస్పత్రులకు వెళ్లి పింఛన్ల అందజేత




రావికమతం: కేజీహెచ్‌లో చినతల్లికి పింఛన్ అందిస్తున్న వలంటీరు



కేజీహెచ్‌లో అప్పలాచారికి పింఛన్ అందిస్తున్న వలంటీరు

రావికమతం/నర్సీపట్నం/కె.కోటపాడు: గ్రామ వలంటీర్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. విధి నిర్వహణలో సేవా దృక్పథంతో వ్యవహరిస్తూ శభాష్ అనిపించుకుంటున్నారు. ఈ క్రమంలో రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన పూడి చినతల్లి అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న గ్రామ వలంటీరు మంజేటి లోవకుమార్ శుక్రవారం అక్కడకు వెళ్లి పింఛన్ అందించి తన మానవత్వాన్ని చాటుకున్నాడు. ఇదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కె.కోటపాడు మండలం చౌడువాడ గ్రామానికి చెందిన జి.అప్పలాచారికి వలంటీర్ జి.రాజి పింఛన్ నగదు అందించింది. వలంటీర్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ రొంగలి సూర్యనారాయణ, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్ అభినందించారు. నర్సీపట్నం మండలం యరకన్నపాలెం గ్రామానికి చెందిన భీమిరెడ్డి చిన్నబ్బాయి అనారోగ్యంతో పినాకిల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కష్టంలో ఉన్న చిన్నబ్బాయికి ఆర్థిక తోడ్పాటును అందించాలనే సంకల్పంతో గ్రామ వలంటీర్ ఆదిలక్ష్మి, గృహసారథి దేముడు అక్కడకు వెళ్లి పింఛన్ సొమ్ము అందజేశారు.



జాతీయ స్థాయి పోటీలకు యలమంచిలి క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులతో కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ

యలమంచిలి: జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు యలమంచిలి పట్టణానికి చెందిన ఐదుగురు క్రీడాకారులు ఎంపికైనట్టు కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ తై క్వాండో పోటీలకు యు.జయశ్రీ, రొట్ట పల్లవి, ఎల్. లహరి పాల్గొంటారన్నారు. గతేడాది డిసెంబరులో వైఎస్సార్ జిల్లా రైల్వేకోడూరులో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించారన్నారు. ఈ నెల 8 నుంచి 10వ తేదీ వరకు డెహ్రాడూన్‌లో తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహించే సీనియర్ నేషనల్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో గొల్లవిల్లి విజయ్‌కుమార్, తుంపాల శ్వేత పాల్గొననున్నారని తెలిపారు. వీరు ఫిబ్రవరిలో కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి ఈ పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఏపీ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.అచ్చుతరెడ్డి, సహాయ కార్యదర్శి సిహెచ్ వేణుగోపాలరావు, కోశాధికారి బి.అర్జునరావు, ఉపాధ్యాయుడు ములంపాక అచ్చంనాయుడు అభినందించారు.

నేవీ పనులకు సహకరించాలి



మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

రాంబిల్లి : నేవీ పనులకు ఆటంకం కల్గించకుండా సహకరించాలని ఆర్డీవో చిన్నికృష్ణ కోరారు. చినకలవలాపల్లిలో శుక్రవారం ఆయన పర్యటించారు. సామాజిక అటవీశాఖ భూములను రక్షణ శాఖకు అప్పగించారు. దీంతో నేవీ ప్రహరీ నిర్మాణం, ఇతర పనులు చేపట్టింది. గతంలో ఈ స్థలాల్లో వన సంరక్షణ సమితులు ఏర్పాటు చేసి మొక్కల్ని పెంచుకున్నామని, వాటికి పరిహారం అందించాలని గ్రామస్తులు కోరారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ పరిహారం విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాగ్యవతి, ఎస్ఐ దీనబంధు, ఆర్ఐ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ కల్పనలో వైద్య సిబ్బంది నిర్లక్ష్యం

- ఏపీ గిరిజన సంఘం ఆరోపణ



ఆస్పత్రి వెయిటింగ్ హాల్ వద్ద బాధితుడు జమ్మన్న

నర్సీపట్నం: గిరిజనులకు అంబులెన్స్ ఏర్పాటు చేయటంలో ఏరియా ఆస్పత్రి వైద్య సిబ్బంది నిర్లక్ష్యం వీడాలని ఏపీ గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గోవిందరావు డిమాండ్ చేశారు. రావికమతం మండలం ధర్మవరం గ్రామానికి చెందిన సీరగం జమ్మన్న(67)కు కడుపు నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఏరియా ఆస్పత్రిలో చేర్పించారన్నారు. అక్కడ వైద్యులు విశాఖ కేజీహెచ్‌కు రిఫర్ చేశారన్నారు. వెంటనే ఐటీడీఏ అంబులెన్స్ సిబ్బందికి ఫోన్ చేయగా, డీజిల్ ఖర్చులు పెట్టుకోవాలని సూచించారన్నారు. మరలా ఫోన్ చేస్తే పాడేరు మీటింగ్‌లో ఉన్నాం.. ప్రైవేట్ అంబులెన్స్ పెట్టుకోవాలని చెప్పారన్నారు. దాంతో దిక్కుతోచని స్థితిలో ప్రైవేట్ అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తీసుకెళ్లారన్నారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలతో ఏరియా ఆస్పత్రిలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించిందని, వైద్యులు మాత్రం రిఫర్ చేయటం దారుణమన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నా దృష్టికి రాలేదు..

పాడేరు పీవో ఇచ్చిన జాబితాలో ఉన్న వారికి ట్రైబుల్ అంబులెన్స్ సమకూరుస్తారు. అంబులెన్స్ కావాలని ఎవరూ అడగలేదు. బాధితులు నా దృష్టికి తీసుకువచ్చి ఉంటే ఆస్పత్రి అంబులెన్స్ సమకూర్చేవాళ్లం.

– డాక్టర్ నీలవేణిదేవి, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, నర్సీపట్నం

తల్లి మందలించిందని కుమారుడు అదృశ్యం



లక్ష్మీసాగర్

కశింకోట: తల్లి మందలించిందని అలిగిన ఆమె కుమారుడు కనిపించకుండా పోయాడు. తండ్రి రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎ. ఆదినారాయణరెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయన వివరాల మేరకు... నర్సీపట్నం మండలం నీలంపేట గ్రామానికి చెందిన నడిపూడి రాము, భార్య నూకరత్నం, కుమారుడు లక్ష్మీసాగర్ ఎలియాస్ సాయి(16) కలిసి దార్లపూడి వెళ్లి గురువారం తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని చింతలపాలెం వద్ద ఆగి దుకాణంలో శీతల పానీయం తీసుకున్నారు. దాన్ని రోడ్డుపై జార విడిచిన సాయిని తల్లి మందలించింది. దాంతో అలిగి అక్కడి నుంచి పరారయ్యాడు. అతడి కుటుంబం ప్రస్తుతం పెందుర్తి మండలం సరిపల్లిలో ఉంటోంది. అక్కడ జెడ్పీ హైస్కూలులో సాయి చదువుతున్నాడు.

యువకుడిపై పోక్సో, కిడ్నాప్ కేసు

అచ్యుతాపురం(అనకాపల్లి) : మైనర్ బాలికను మాయమాటలు చెప్పి తీసుకుపోయిన యువకుడిపై కిడ్నాప్, పోక్సో కేసు నమోదు చేసినట్టు పరవాడ డీఎస్పీ కె.వి.సత్యనారాయణ శుక్రవారం మీడియాకు తెలిపారు. డీఎస్పీ అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఖాజీపాలెం గ్రామానికి చెందిన 9వ తరగతి చదువుతున్న మైనర్ బాలిక అదృశ్యమైనట్లు బాలిక తల్లిదండ్రులు ఏప్రిల్ 11న స్థానిక పోలీసులను ఆశ్రయించారు. బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదులో అదే గ్రామానికి చెందిన సుంక రమేష్‌పై అనుమానం వ్యక్తం చేశారు. ఈ మేరకు దర్యాప్తు చేసిన పోలీసులు రమేష్‌ను అదుపులోకి తీసుకుని బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. రమేష్‌పై పోక్సో, కిడ్నాప్ కేసులు నమోదు చేసినట్టు డీఎస్పీ తెలిపారు.

చిట్టీ నిర్వాహకులపై కేసు నమోదు

రాంబిల్లి: మండలంలోని అప్పన్నపాలెంలో చిట్టీల నిర్వాహకులు చింతలపూడి సీతారామరాజు, సంతోషి దంపతులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దీనబంధు శుక్రవారం తెలిపారు. కోటీ 35 లక్షల 38 వేల రూపాయల చిట్టీల సొమ్ముతో ఐదు నెలల క్రితం పరారయ్యారన్నారు. ఇప్పటివరకు వారు వస్తారని, తమ సొమ్ము దక్కుతుందని బాధితులు ఆశపడ్డారని పేర్కొన్నారు. ఇంతవరకు వారి జాడ లేకపోవడంతో ఎట్టకేలకు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యుదాఘాతంతో తాపీమేస్త్రి మృతి



నవీన్ మృతదేహం



నవీన్ (ఫైల్)

కోటవురట్ల: తాపీ పని చేస్తూ ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుంచి పడి యారం నవీన్(45) మృతి చెందాడు. మృతుడి భార్య యారం అప్పలనర్స ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం... నర్సీపట్నం మండలం బలిఘట్టం గ్రామానికి చెందిన నవీన్ తాపీ పనిచేస్తూ జీవన సాగిస్తున్నాడు. రాజుపేటలో మొల్లేటి వెంకటరమణ ఇంటి వద్ద తాపీ పనిచేస్తుండగా భవనం పరంజాపై నుంచి ప్రమాదశాత్తు జారిపడ్డాడు. పక్కనే విద్యుత్ తీగలు తాకడంతో షాక్‌కు గురయ్యాడు. వెంటనే భవన యజమాని నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించి అతడి భార్య అప్పలనర్సకు సమాచారం ఇచ్చాడు. ఆస్పత్రికి తీసుకెళ్లేసరికే నవీన్ మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

పలు చోరీలతో సంబంధమున్న మహిళ అరెస్టు

- 93 గ్రాముల బంగారం, 58 గ్రాముల వెండి స్వాధీనం



డీఎస్పీ సుబ్బరాజు

అనకాపల్లి టౌన్: స్థానిక జాతీయ రహదారి సుంకరమెట్ట కూడలి వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న విజయనగరం జిల్లా వెంకటరామ మండలం పిట్టాడ గ్రామానికి చెందిన గొల్లి మౌనిక(27)ను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ సుబ్బరాజు చెప్పారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి విలేకరులతో ఆయన మాట్లాడారు. గతనెల 26న ఉడ్‌పేటకు చెందిన నామా మాణిక్యమ్మ మండలంలో తుమ్మపాల యూనియన్ బ్యాంకుకు ఆటోలో వెళ్తుండగా అదే ఆటోలో ప్రయాణిస్తున్న గుర్తు తెలియని మహిళ 32.3 గ్రాముల బంగారు పుస్తెలతాడు చోరీకి గురైనట్లు బాధితురాలు పట్టణ పోలీసులు ఆశ్రయించింది. ఈమేరకు సీఐ దాడి మోహనరావు కేసు నమోదు చేసిన నేపథ్యంలో మౌనిక పలు చోరీలకు పాల్పడినట్టు పోలీసుల విచారణలో తేలిందని డీఎస్పీ తెలిపారు. మే 22న వడ్డాది నుంచి బంగారుమెట్టకు వెళ్తున్న ఆటోలో చింతాడ వరలక్ష్మి మెడలో నుంచి 56.3 గ్రాముల బంగారం తాడు చోరీకి గురైనట్లు బుచ్చెయ్యపేట పోలీసులను ఆశ్రయించింది. గత నెల 26న చోడవరం ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి నారాయణపేటకు ఆటోలో వెళ్తున్న సుంకర చిలుకమ్మ బ్యాగు నుంచి 58 గ్రాముల వెండి, 4.6 గ్రాముల బంగారం చోరీకి గురైనట్లు అదేరోజు చోడవరం పోలీసులను ఆశ్రయించింది. పై చోరీలకు పాల్పడినట్లు మౌనిక అంగీకరించిందని డీఎస్పీ చెప్పారు. ఈ మేరకు మౌనిక నుంచి 93 గ్రాముల బంగారం, 58 గ్రాముల వెండిని స్వాధీనపరుచుకుని శుక్రవారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించారని డీఎస్పీ తెలిపారు. మౌనిక తనతో మైనర్ బాలుడిని వెంటపెట్టుకుని తిరిగేదని డీఎస్పీ పేర్కొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థి దుర్మరణం



గండిగుండం వద్ద జరిగిన రోడ్డు ప్రమాద దృశ్యం

ఆనందపురం: గండిగుండం వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థి మృతి చెందాడు. వివరాలివీ.. అనకాపల్లి జిల్లా తుమ్మపాలకు సమీపంలోని చినబాబు కాలనీకి చెందిన అయినవిల్లి వికాస్(19) దాకమర్రి వద్ద గల రఘు ఇంజినీరింగ్ కళాశాలలో మొదట సంవత్సరం చదువుతున్నాడు. అక్కడే తోటి స్నేహితులతో కలిసి ఒక గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. కాగా.. శనివారం తమ దగ్గర బంధువులు వివాహం ఉండడంతో ఇంటికి వస్తానని వికాస్ తండ్రి నాగేశ్వరరావుకు ఫోన్ చేసి అడగ్గా సమ్మతించాడు. తాడేపల్లిగూడెంలో వ్యాపారులకు సరఫరా చేయడానికి విజయనగరంలో ఓ వ్యాపారి వద్ద తెలగపిండి కొనుగోలు చేసి బొలెరోలో లోడు చేసి ఉందని.. అక్కడకు వెళ్లి ఆ వ్యాన్‌లో అనకాపల్లికి రావాలని వికాస్‌కు తండ్రి సూచించాడు. ఈ మేరకు వికాస్ విజయనగరం వెళ్లి బొలెరోలో బయలుదేరాడు. ఆ వ్యాన్ అనకాపల్లి వైపు వెళ్తుండగా గండిగుండం వద్ద ఆగి ఉన్న వ్యాన్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో వ్యాన్ కేబిన్‌లో కూర్చున్న వికాస్ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. వ్యాన్ డ్రైవర్ తిలక్ కుమార్ ఎడమ కాలు విరిగి పోయింది. డ్రైవర్ తిలక్‌ను ఆనందపురం పోలీసులు ఆస్పత్రికి తరలించి.. వికాస్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

క్లుప్తంగా

భీమునిగుమ్మంలో 'గడప గడపకు' నేడు

అనకాపల్లిటౌన్ : గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం సాయంత్రం 4 గంటలకు 83వ వార్డు పరిధిలోని భీమునిగుమ్మంలో నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విచ్చేస్తారని పేర్కొన్నారు. వివిధ ప్రభుత్వశాఖ అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు హాజరుకావాల్సిందిగా కోరారు.

సురక్ష బీమా యోజనపై అవగాహన నేడు

కశింకోట : మండలంలోని నూతలగుంటపాలెంలో శనివారం ఉదయం 11 గంటలకు సురక్ష బీమా యోజనపై అవగాహన కార్యక్రమం నిర్వహించనున్నట్టు యలమంచిలి ఎస్‌బీఐ శాఖ మేనేజర్ జి.రవికుమార్, ఫీల్డ్ అధికారి వందన తెలిపారు. ఈ సందర్భంగా రూ.20, రూ.400తో అమలు చేస్తున్న సురక్ష బీమా యోజనపై సమగ్ర అవగాహన కలిగించి, ఖాతాదారులను పథకంలో చేర్పనున్నట్లు పేర్కొన్నారు.

కశింకోట ఎంపీడీవోగా రవికుమార్

కశింకోట : కశింకోట నూతన ఎంపీడీవోగా వి.వి.రవికుమార్ నియమితులయ్యారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా పని చేసిన ఈవోఆర్డీ కొంకి అప్పారావు పదోన్నతిపై కాకినాడ జిల్లాకు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విజయనగరం జిల్లాకు చెందిన ఈవోఆర్డీ రవికుమార్‌కు పదోన్నతి కల్పించి, ఇక్కడకు బదిలీ చేశారు. ఆయన శనివారం బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఇన్‌చార్జి ఎంపీడీవోగా ఏవో ఎ.ఎ.ఖాన్ వ్యవహరిస్తున్నారు.

పిల్లల ఎదుగుదలకు క్రీడలు దోహదం



పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్న రమణాజీ

అనకాపల్లిటౌన్ : క్రీడలు పిల్లల్లో ఉత్సాహం, ఆరోగ్యం, ఎదుగుదలకు ఎంతగానో దోహదపడతాయని గౌరీ సేవా సంఘం కార్యదర్శి బుద్ధ రమణాజీ అన్నారు. గవరపాలెం గౌరీ పంచాయతన దేవాలయం ఆవరణలో పిల్లలకు వేసవి శిక్షణలో భాగంగా శుక్రవారం పౌష్టికాహారాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2015వ సంవత్సరం నుంచి ఏటా పిల్లలకు సంఘం ఆధ్వర్యంలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేసవిలో క్రీడల ద్వారా శరీరం దృఢమై, వివిధ వ్యాధులను తట్టుకునేలా రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉల్లూరు రాజేష్, కాండ్రేగుల సురేష్, త్రినాథ్ పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	: రాజా
అహింస	: సత్యనారాయణ స్క్రీన్-1
పరేషాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
ది కేరళ స్టోరీ	: షిర్డిసాయి
విరూపాక్ష	: పర్తిసాయి
చక్రవ్యూహమ్	: వెంకటేశ్వర
నేను స్టూడెంట్ సర్	: శ్రీసత్య
బిచ్చగాడు-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 19 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-15 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 422 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 236 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

పాడి రైతుకు భరోసా

- అమల్లోకి పశు బీమా
- మూడేళ్ల కాలానికి 20 శాతం ప్రీమియం
- 21 రోజుల్లోపే బీమా పరిహారం అందేలా చర్యలు



మేత మేస్తున్న గొర్రెలు (ఇన్‌సెట్) పశువులు

అనకాపల్లి రూరల్ : పాడినే నమ్ముకుని జీవనం సాగిస్తున్న రైతులకు భరోసా కల్పిస్తూ ప్రభుత్వం తాజాగా వైఎస్సార్ పశు బీమా పథకాన్ని అమల్లోకి తెచ్చింది. గతంలో ఉన్న వైఎస్సార్ పశు నష్ట పరిహార పథకం కంటే మెరుగ్గా ఈ పథకాన్ని రూపొందించారు. నేషనల్ లైవ్ స్టాక్ మిషన్(ఎన్‌ఎల్‌ఎం) కింద దీన్ని అమలు చేస్తున్నారు.

మూడేళ్లపాటు చెల్లుబాటు

ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలకు ఈ పథకం వర్తిస్తుంది. పాడి రైతులకు బాగా మేలు చేస్తుందని పశు సంవర్ధకశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రమాదం వల్ల గానీ, సాధారణంగా గానీ పశువులు చనిపోతే వాటికి నష్ట పరిహారం బీమా సంస్థ అందిస్తుంది. ఆవు, గేదెకు రూ.30 వేలు, గొర్రె, మేకకు రూ.6 వేలు నష్ట పరిహారం అందుతుంది. పాడి రైతులు తమ వద్దనున్న అన్ని పశువులకు బీమా చేయించుకోవాలి. ఒక రైతుకు గరిష్ఠంగా ఐదు ఆవులు, గేదెలకు బీమా వర్తిస్తుంది. 50 గొర్రెలు, మేకల వరకు బీమా చేయించుకోవచ్చు. పాడి రైతులు, కాపర్లకు ఆర్థిక ప్రయోజనం కలిగేలా ఈ పథకం రూపొందించారు. రైతు తరపున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 80 శాతం వరకు ప్రీమియాన్ని చెల్లిస్తాయి. ఇది మూడేళ్లపాటు చెల్లుబాటవుతుంది. నెలలపాటు కాలయాపన లేకుండా పశు, జీవ సంపద మరణించిన 21 రోజుల్లోపే లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి పరిహారం జమయ్యేలా నిబంధన పెట్టారు. ఏదైనా సాంకేతిక కారణాలవల్ల జమ కాకపోతే ఆ విషయాన్ని పారదర్శకంగా ఆన్‌లైన్ పోర్టల్‌లో ఉంచుతారు.

ప్రీమియం చెల్లింపులు ఇలా..

ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు తమ వాటా కింద 20 శాతం, ఇతరులు 50 శాతం ప్రీమియం చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీ రైతులతోపాటు నిరుపేద రైతులు సంకరజాతి పశువులకు మూడేళ్ల కాలానికి తమ వాటా కింద ఒక్కోదానికి రూ.384 ప్రీమియం కట్టాలి. అదే దేశీయ పశుజాతికి తమ వాటా రూ.480 చెల్లించాలి. ఇతర రైతులైతే సంకర జాతి పశువులకు తమ వాటా కింద రూ.960 చెల్లించాలి. గొర్రెలు, మేకలకు ఒక్కోదానికి ఎస్సీ, ఎస్టీ, పేద వర్గాలు తమ వాటాగా ఏడాదికి రూ.36, రెండేళ్లకు రూ.54, మూడేళ్ల బీమాకు రూ.75 కట్టాల్సి ఉంటుంది. ఇతర వర్గాలు ఒక్కోదానికి ఏడాదికి రూ.90, రెండేళ్లకు రూ.135, మూడేళ్లకు రూ.187.50 ప్రీమియం రూపంలో చెల్లించాలి. ఒకవేళ అధిక ధరకు బీమా చేయించుకోవాలంటే ఆ పశువు విలువను బట్టి ఎస్సీ, ఎస్టీ, పేద వర్గాలు 7.6 శాతం, ఇతర వర్గాలు 9.6 శాతం ప్రీమియం కట్టాలి. ఎక్కడికక్కడ పశు వైద్యులు, శాఖ అధికారులను సంప్రదించి బీమా పథకాన్ని పాడి రైతులు ఉపయోగించుకోవాలని ప్రభుత్వం కోరుతోంది.

అనకాపల్లి ఏడీ పరిధిలో పశుసంపద

మండలం	ఆవులు	గేదెలు	గొర్రెలు, మేకలు
అనకాపల్లి	8,748	13,676	10,200
కశింకోట	7,096	10,348	14,524

బీమాతో రైతులకు ధీమా



ఇప్పటికే ఈ పథకానికి సంబంధించి రిజిస్ట్రేషన్లు ప్రారంభమయ్యాయి. పాడి రైతులంతా తమ పశువులకు బీమా చేయించుకోవచ్చు. వైఎస్సార్ పశు బీమాతో రైతులు ధీమాగా ఉండొచ్చు. ఈ పథకానికి ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి. బీమా పాలసీ తీసుకోవడానికి ఆవులు, గేదెలు కనీసం ఒకసారి ఈని ఉండాలి. వాటికి ఏడాదిన్నర వయసు నుంచి పదేళ్ల వయసు మధ్యలో ఉండాలి. గొర్రెలు, మేకలకు 6 నెలలు వయసు దాటాలి.

– డాక్టర్ బి.సౌజన్య, అసిస్టెంట్ డైరెక్టర్, పశు సంవర్ధక శాఖ, అనకాపల్లి

'కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి'



వేసవి శిక్షణలో సర్టిఫికెట్లు అందుకున్న చిన్నారులు

తుమ్మపాల : పోటీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి, ఉద్యోగ అవకాశాలు పొందేందుకు కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరని జిల్లా దేవదాయ, ధర్మదాయ శాఖాధికారి ఎస్.రాజారావు అన్నారు. పట్టణంలోని శ్రీగౌరీ గ్రంథాలయం ఆధ్వర్యంలో జరిగిన కంప్యూటర్ శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్నతనం నుంచే కంప్యూటర్ నైపుణ్యం అవసరమన్నారు. కంప్యూటర్ భవితకు భరోసాగా మారిందన్నారు. వేసవి శిక్షణ శిబిరం ద్వారా గ్రంథాలయంలో కంప్యూటర్ శిక్షణ అందించిన నిర్వాహకులను అభినందించారు. శిక్షణలో భాగంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, మాజీ కార్యదర్శి మళ్ల బాపు నాయుడు, కె.సత్యనారాయణ, జగ్గారావు, మళ్ల సూరిబాబు పాల్గొన్నారు.

ఆడారి జ్యోత్స్నకు అభినందన



ఆడారి జ్యోత్స్నను అభినందిస్తున్న దాడి రత్నాకర్

తుమ్మపాల : ఇటీవల కేరళలో జరిగిన ఏషియన్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో బంగారు పతకం సాధించిన ఆడారి జ్యోత్స్నను వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ శుక్రవారం అభినందించారు. పట్టణానికి చెందిన ఇంటర్ విద్యార్థిని జ్యోత్స్న ప్రపంచస్థాయి పోటీల్లో పతకం సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. చిన్నవయస్సులోనే ఈ విజయం సాధించడం అనకాపల్లికి గర్వకారణమన్నారు. ఆమె స్థానిక వేల్పుల వీధి శ్రీరాందేవ్ జిమ్‌లో జి.నీల వద్ద శిక్షణ పొందుతోంది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబీ, కొణతాల భాస్కరరావు పాల్గొన్నారు.

హిందూ ధర్మ పరిరక్షణకు ఛత్రపతి ఎనలేని కృషి



ఛత్రపతి శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సభ్యులు

పరవాడ: హిందూధర్మ పరిరక్షణకు ఛత్రపతి శివాజీ ఎంతో కృషి చేశారని సబ్‌డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు అన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరవాడ రామాలయంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ సామ్రాజ్య దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. హిందువులంతా హిందూ ధర్మ పరిరక్షణకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతీ పౌర్ణమికి దేవాలయం కేంద్రంగా సామూహిక హారతి, వారం వారం భజన, ఏకాదశి రోజు నగర సంకీర్తన, భగవంతుడిని పురవీధుల్లో ఊరేగించడం వంటి కార్యక్రమాలను నిర్వహించాలని అప్పలనాయుడు కోరారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ సభ్యులు రెడ్డి రమణమ్మ, పార్వతి, నూకాలమ్మ, గంగరాజు, అచ్చిబాబు, లోవరాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కశింకోట : మండలంలోని నూతలగుంటపాలెం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటనపై రెండు రోజుల తర్వాత వచ్చిన ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. ఉగ్గినపాలెం గ్రామానికి చెందిన చంబకాయల లోవరాజు, పూడి రత్నం గత నెల 31న యలమంచిలి కూలీ పనికి వెళ్లి బైక్‌పై తిరిగి వస్తుండగా మార్గమధ్యంలో నూతలగుంటపాలెం వద్ద వెనుక నుంచి లారీ ఢీకొట్టి పరారైంది. దీంతో లోవరాజు, రత్నం రోడ్డుపై పడి తీవ్రంగా గాయపడగా స్థానికులు అనకాపల్లిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. చంబకాయల జ్యోతి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అగ్నిప్రమాదంలో చెరకు తోట దగ్ధం



ఏనుగుతుని వద్ద పొలాల్లో దగ్ధమైన వరి, చెరకు పిప్పి కుప్పలు

కశింకోట : మండలంలోని ఏనుగుతుని గ్రామం పొలాల్లో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో వరి కుప్ప, చెరకు పిప్పి కుప్ప, చెరకు తోట దగ్ధమయ్యాయి. సుమారు రూ.60 వేలు నష్టం వాటిల్లింది. గొల్లవిల్లి బాబూరావుకు చెందిన చెరకు క్రషర్ వద్ద అకస్మాత్తుగా మంటలు చెలరేగి, అక్కడ కళ్లంలో ఉన్న వరి, చెరకు కుప్పలతోపాటు పక్కనున్న సుమారు అర ఎకరం చెరకు తోటకు మంటలు వ్యాపించాయి.

అయితే ప్రమాదానికి స్పష్టమైన కారణాలు తెలియరాలేదు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. మంటల్ని స్థానిక రైతులు అదుపు చేశారు.

కిడ్నీ రోగికి పింఛన్ అందజేత



వీరునాయుడికి పింఛన్ అందిస్తున్న నాగేశ్వరావు

పరవాడ: మండలంలోని రావాడ శివారు ధర్మారాయుడుపేట గ్రామానికి చెందిన కిడ్నీ వ్యాధి గ్రస్తుడు మోటూరు వీరునాయుడుకు వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు ప్రభుత్వం మంజూరు చేసిన పింఛన్ సొమ్మును శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, నాయకులు కొలగాని సాంబ, వెల్ఫేర్ అసిస్టెంట్ స్వాతి కుమార్, వలంటీరు వనజ పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న సింహాద్రి జీజీఎం సిన్హా

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ సీఎస్సార్ విభాగం ద్వారా నిర్వహించనున్న వేసవి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా పిలుపునిచ్చారు. వ్యక్తిత్వ వికాసం కోసం మూడు రోజుల పాటు నిర్వహించే వేసవి శిబిరాన్ని జీజీఎం సిన్హా, దీపికాలేడీస్ క్లబ్ అధ్యక్షురాలు అంజూ సిన్హా శుక్రవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం జీజీఎం సిన్హా మాట్లాడుతూ ప్రతి వ్యక్తి వ్యక్తిత్వ వికాసం, జీవిత నైపుణ్య విద్యకు పెద్ద ప్రాముఖ్యత ఉందన్నారు. వర్క్‌షాపులో గర్ల్ ఎంపవర్‌మెంట్ మిషన్ (జెమ్) బాల్ భవన్ చిన్నారులు, డీఎల్‌సీ మహిళా సభ్యులకు శిబిరం నిర్వహిస్తున్నామని సిన్హా చెప్పారు.

ఉపాధ్యాయ వృత్తితో భావితరాలకు భవిత



స్పెల్ ఇండక్షన్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యంనాయుడు

తుమ్మపాల : ఉపాధ్యాయ వృత్తితోనే భావితరాల భవితకు చక్కటి బాటలు వేయవచ్చని డైట్ ప్రిన్సిపాల్ యు.మాణిక్యంనాయుడు అన్నారు. పట్టణంలోని జేఎంజే పాఠశాలలో స్పెల్ ఇండక్షన్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న అంశాలను వచ్చే విద్యాసంవత్సరంలో పాఠశాల స్థాయిలో అమలుచేయాలన్నారు.

నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన వారు విద్యార్థుల అభ్యసనంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అంతకు ముందు శిక్షణ పొందిన ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మంజుల, రిసోర్సు పర్సన్లు కోటేశ్వరరావు, అప్పాజీ, శ్రీహర్ష, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'ఫ్రై'డే !



జన సంచారంలేక వెలవెలబోతున్న కశింకోట పంచాయతీ ప్రధాన రహదారి

కశింకోట : మండల ప్రజలు సూర్య తాపంతో శుక్రవారం విలవిలలాడారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉక్కపోతలతో సతమతమయ్యారు. ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండడంతో వల్ల ప్రజలు చాలా వరకు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో కశింకోటలోని ప్రధాన వీధులు జన సంచారం లేక వెలవెలబోయాయి. ఇక్కడ గూగుల్ ప్రకారం గరిష్ఠంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదయింది.

సూర్యనారాయణుడికి శాంతి హోమం

నేడు చినజీయర్ స్వామి చేతుల మీదుగా విగ్రహాల ప్రతిష్ట



శాంతి హోమం చేస్తున్న వేదపండితులు

అనకాపల్లిటౌన్ : గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన రాజుపాలెం శ్రీ సూర్యనారాయణస్వామి ఆలయంలో గత మూడురోజులుగా జరుగుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ అర్చకులు డి.కల్యాణ్‌కుమార్, వేదపండితులు ఆరాధన యాగశాలలో శాంతి హోమం నిర్వహించారు. హోమాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అంతకుముందు ఉత్సవ విగ్రహాలకు వేదపండితులు విశేష పూజలు జరిపారు. శనివారం ఉదయం చినజీయర్‌స్వామి చేతుల మీదుగా మహాలక్ష్మి సమేత వైకుంఠ నారాయణ, శ్రీ వెంకటేశ్వరస్వామి, లక్ష్మీ నారాయణ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు జి.రామకోటేశ్వరరావు, రామకృష్ణ, నర్సింగరావు, వెంకటరమణ, చిరంజీవి, రామకోటి, వరహాలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యం అత్యంత శ్రేష్టం



వివిధ రాష్ట్రాల ఆయుర్వేద వైద్యులతో సుందర్‌రాజ్ పెరుమాళ్

అనకాపల్లిటౌన్ : ఆయుర్వేద వైద్యంలో వివిధ రకాలైన వ్యాధులకు ఉచితంగా మందులు పంపిణీ చేయడంతోపాటు, ఆయుర్వేద వైద్యులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆరోగ్యధాత్రి ఆయుర్వేద పరిశోధన సంస్థ వ్యవస్థాపకుడు సుందర్‌రాజ్ పెరుమాళ్ తెలిపారు. మండలంలోని కోడూరు పరిశోధనా కేంద్రంలో ఐదు రోజులుగా నిర్వహించిన వివిధ రాష్ట్రాల ఆయుర్వేద వైద్యుల శిక్షణాకార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా, తెలంగాణాతోపాటు మన రాష్ట్రానికి చెందిన 50 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చి, సర్టిఫికెట్లు అందజేసినట్లు తెలిపారు. వామన కర్మ, విద్ధ కర్మ, నేత్రక్రియా కల్పం వంటి అతి ప్రాచీన చికిత్స ప్రక్రియలపై శిక్షణ ఇచ్చినట్లు వెల్లడించారు. బ్రహ్మముహూర్తంలో నిద్ర లేవడం, యోగాభ్యాసం, ప్రాణయామం, ధ్యానం, ఆయుర్వేద దినచర్య వరకూ ప్రతి అంశాన్ని ప్రత్యక్షంగా వివరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు ఉమామహేశ్వర పట్నాయక్, సత్యనారాయణ, రవికాంత్, సత్యప్రశాంత్, ఈశ్వరరావు, హేమ తదితరులు పాల్గొన్నారు.

విద్యా కానుక పంపిణీకి సన్నద్ధం



విద్యా కానుక కిట్ల నాణ్యతా వాల్ వద్ద సిబ్బంది

కశింకోట : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పంపిణీ చేయడానికి విద్యా కానుక కిట్లను సిద్ధం చేస్తున్నారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలల ప్రారంభంలోనే కిట్లను పంపిణీ చేయనున్నారు. ఈ నేపథ్యంలో మండలంలో ఉన్న 59 పాఠశాలల్లో 1వ తరగతి నుంచి టెన్త్ విద్యార్థులు 6,325 మందికి తొలి రోజే అందించేలా ఉపాధ్యాయ సిబ్బంది సన్నద్ధమవుతున్నారు. విద్యా కానుకలో భాగంగా కిట్‌లో స్కూల్ బ్యాగ్, మూడు జతల యూనిఫారం, బూట్లు, రెండు జతల సాక్షులు, బెల్టు, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు సమకూర్చి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అందించనున్నట్లు ఎంఈవో చిట్టిబాబు వెల్లడించారు.

ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్ల పంపిణీ



ట్రాక్టర్ల పంపిణీలో ఏవో స్వప్న

కశింకోట : మండలంలోని 11 గ్రామాలకు చెందిన కస్టం హైరింగ్ కేంద్రాల ద్వారా వైఎస్సార్ యంత్ర సేవా పథకం కింద రూ.82.50 లక్షల విలువైన ట్రాక్టర్లు, పనిముట్లను పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి స్వప్న తెలిపారు. అనకాపల్లిలో జరిగిన కార్యక్రమంలో శుక్రవారం వీటిని అందించారు. కశింకోట, కొత్తపల్లి, వెదురుపర్తి, ఏఎస్ పేట, చింతలపాలెం, అచ్చెర్ల, జి.భీమవరం, తేగాడ రైతు భరోసా కేంద్రాల పరిధిలో కస్టం హైరింగ్ కేంద్రాలకు ఒక్కొక్కటి చొప్పున మొత్తం 8 ట్రాక్టర్లను పంపిణీ చేశారు. ట్రాక్టర్ కంపెనీల మేరకు వీటిని రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల పైబడి రాయితీపై రైతులకు అందించారు. ఈ ట్రాక్టర్లను తాము వినియోగించడంతోపాటు వ్యవసాయ అవసరాలకు కావలసిన రైతులకు కూడా అద్దె ప్రాతిపదికన కస్టం హైరింగ్ కేంద్రాల నిర్వాహకులు సమకూర్చాల్సి ఉంటుందని వ్యవసాయాధికారి పేర్కొన్నారు. రొటావేటర్లు, దమ్ము, దుక్కి నాగళ్ల సెట్లు, పవర్ వీడర్లు కూడా 40 శాతం రాయితీపై అందించామన్నారు. ఆయా రైతు భరోసా కేంద్రాలతోపాటు తాళ్లపాలెం, జమాదులపాలెం కేంద్రాల పరిధిలో వీటిని అందించినట్టు వెల్లడించారు.

'జన్ భాగీదరి' ను విజయవంతం చేయండి



జన్ భాగీదరి కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో అప్పలరాజు తదితరులు

సబ్బవరం: మండలంలోని పెదనాయుడుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జి-20 జన్ భాగీదరి కార్యక్రమాన్ని ప్రధానోపాధ్యాయురాలు దొడ్డి లక్ష్మి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖాధికారి ఎస్ .అప్పలరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పునాది అభ్యసన మరియు సంఖ్యాశాస్త్ర నైపుణ్యాల సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని కోరారు.ఈ నెల 1 నుంచి 15వ తేదీ వరకూ ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి భాష, గణితంలో కొన్ని కృత్యాలు చేసి వాటిని రాష్ట్ర స్థాయిలో గూగుల్ ట్రాకర్‌లోకి అప్‌లోడ్ చేయాలన్నారు. అందులో విద్యార్థుల తల్లిదండ్రులను భాగస్వాములు చేయాలని తెలియజేశారు. ప్రతి పాఠశాలలో తయారు చేసిన టీఎల్ఎంను ప్రదర్శించాలని,సాంస్కృతిక కార్యక్రమాలు,పాఠశాల సంసిద్ధత మేళాలు, సాంకేతిక వినియోగం, ఎస్ఎంసీలతో సమావేశాలు నిర్వహించాలన్నారు. ఆడియో విజువల్‌ను ఉపయోగించి పునాది అభ్యసన సంఖ్యా శాస్త్ర నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, కథలు చెప్పడం, క్విజ్, పద్యాలు, గోడమీద చిత్రాలు, వీధి నాటకాలు, బుర్రకథలు వంటివి ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎంఆర్సీ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, పేరెంట్స్ కమిటీ సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో నాటుకోళ్లు మృతి



గొర్లివానిపాలెంలో మృత్యువాత పడిన నాటుకోళ్లు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం శివారు గొర్లివానిపాలెం కుక్కల దాడిలో సుమారు 20 వరకూ నాటు కోళ్లు శుక్రవారం మృతి చెందాయి. గ్రామంలోని లెక్కల త్రినాథ్‌కు చెందిన షెడ్‌లో ప్రవేశించిన కుక్కలు కోళ్ల మెడలు కొరికి చంపేశాయని స్థానిక రైతులు తెలిపారు. కోళ్ల విలువ రూ.10 వేల పైనే ఉంటుందని చుట్టు పక్కల రైతులు చెప్పారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కల బెడద తగ్గించాలని కోరుతున్నారు.